ప్రజాశక్తి
శనివారం 3 ఫిబ్రవరి 2024
I
అల్లూరి సీతారామరాజు

నిరుపయోగంగా తాగునీటి బోరు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని జంగడివలస అంగన్వాడి కేంద్రంలో నిర్మించిన బోరు ప్రస్తుతం మరమ్మతుకు గురై నిరుపయోగంగా మూలన పడింది. దీంతో అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం వండి పెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు.సుమారు ఆరు నెలలు గడుస్తున్న ఎప్పటికీ నిరుపయోగంగానే ఉందని గ్రామస్తులు అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి్న బోరు మరమ్మత్తు చేపట్టి వినియోగంలోకి తీసుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మరమ్మతుకు నోచని బోరు

గిరిజనుల అభ్యున్నతికి కేటాయింపులు ఏవీ?

కేంద్ర బడ్జెట్‌పై పెదవి విరుపు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఎన్నికల ముందు వరాల బడ్జెట్ అంటూ డప్పు కొట్టారు. అయితే జనరల్ ఎన్నికల ముందు కావడంతో ఉన్న పథకాల అమలు, అత్యవసర అంశాలతో పాటు వివిధ వర్గాలకు ఊరట కలిగించే అంశాలు ప్రకటించే అవకాశం ఉందని అందరూ ఆశించారు. అందులో ప్రధానంగా వేతన జీవులు, మధ్యతరగతి వర్గాల వారు ఎదురుచూసే ఆదాయ పన్ను పరిమితి పెంపు. పిఎం కిసాన్ యోజన నగదు పెంపు, అలాగే ఇతర కొన్ని కీలక అంశాలపైన ఆయా వర్గాల్లో చర్చ సాగింది. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ లో ఈసారి కూడా అమరావతికి మొండి చేయే చూపారు. ఎన్నికలవేళ విభజన హామీలు అమలుపై బడ్జెట్ లో ఎన్నో ఆశలు ఉండేవి. విభజన హామీలపై ప్రస్తావన లేదు. గిరిజనల అభివృద్ధికి రావాల్సిన నిధులు లేవు.సామాన్యుల ఓట్లను ఆకర్షించడమే లక్ష్యంగా సొంతింటి కలను నెరవేర్చుకోవాలనే బడుగు జీవుల ఆశలపై ఓట్ల వల విసిరింది. వేతన జీవులకు పన్ను విధానాల్లో ఊరట కలిగించకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొత్త విధానంలో రూ.7 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉండగా, దాన్ని రూ.8 లక్షలకు పెంచుతారని ప్రచారం జరిగినా కరుణించలేదు. పిఎం కిసాన్ సాయాన్ని రూ.8 వేలకు పెంచుతారని లీకులిచ్చిన బడ్జెట్ లో ఆ ఊసే లేదు.

బడ్జెట్లో ఈసారి కూడా పోలవరానికి ప్రత్యేక నిధులు కేటాయించిన దాఖలాలు లేవు. ఆర్ అండ్ ఆర్ పూర్తిస్థాయిలో అమలు చేయడం గానీ ప్రాజెక్టును పూర్తి చేయడానికి గానీ కేంద్రం ఇచ్చే నిధులే ప్రధాన ఆధారం.

గిరిజన రైతాంగానికి ఏదీ లాభం

ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట గిరిజన రైతన్నను నిరాశపరిచింది. గిరిజన ప్రాంతం అభివృద్ధికి కేటాయింపులు లేవు. మద్దతు ధరల చట్టం తీసుకురావాలని రైతులు కోరుతున్నా కేంద్ర బడ్జెట్ లో ప్రతిపాదన లేదు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పినా మోదీ పంటల ఖర్చులు, రైతుల ఆత్మహత్యలు రెట్టింపు చేశారు. ఎరువుల ధరలు తగ్గిస్తామని రైతులకు మాట ఇచ్చి బడ్జెట్లో అంశాన్ని చేర్చలేదు. పిఎం కిసాన్ సాయాన్ని రూ.9 వేలకు పెంచుతారని అంచనా వేసిన ఆ దిశగా ఎలాంటి ప్రకటన చేయక పోవడం గమనార్హం.ఇది పూర్తిగా ఎన్నికల బడ్జెట్.

దీసరి గంగరాజు
సిపిఎం జెడ్‌పిటిసి, అనంతగిరి

బిజెపికి ఇదే ఆఖరి బడ్జెట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ఇదే ఆఖరి బడ్జెట్. ఈ ప్రభుత్వానికి మరోసారి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం లేదు. సామాన్యుడిపై పేను భారం మోపేలా కేంద్రం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ ఉంది. ఇటువంటి బడ్జెట్ వల్ల ధనవంతుడు మరింత ధనవంతుడు.. పేదవాడు మరింత పేదవాడు అవుతాడు. దోచుకోవడానికి దాచుకోవడానికి అన్నట్టుగా బడ్జెట్ రూపొందించారు. స్వలాభం కోసం దేశ ఆర్థిక ప్రగతిని దెబ్బతీసేలా కార్పొరేట్లకు మేలు చేకూర్చేలా కేంద్ర తాత్కాలిక బడ్జెట్ ఉంది. గిరిజనులకు ఏమాత్రం ఉపయోగం లేదు.

పి.అప్పలనర్స
సిపిఎం జిల్లా కార్యదర్శి

నిరాశపరిచిన బడ్జెట్

ఆదాయ పన్ను పరిధి, పన్ను రేట్లలో ఎలాంటి మార్పు లేక పోవడంతో ఉద్యోగులకు, పెన్షన్ దారులకు నిరాశ కలిగించింది. సగటు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక లోకానికి అనగా వేతన జీవులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. నాలుగేళ్లుగా ఎటువంటి మార్పులు లేని ఆదాయపు పన్ను స్లాబ్ లను యధావిధిగా కొనసాగించడం అమానుషం. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓట్ల ఆకాశాన్ని అధ్యయంగా ప్రభుత్వ,, ప్రైవేటు ఉద్యోగులకు ఎంతో కొంత ఆదాయం తగ్గింపును కేంద్రం ప్రకటిస్తుందని అంతా భావించారు. ఏ ప్రయోజనం లేదు.

కూడా రాధాకృష్ణ
గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి

ఓట్లు కోసమే ఈ బడ్జెట్

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల ఓట్ల కోసం 2024 కేంద్ర బడ్జెట్ ఉంది. అనేక రకాల పన్నులతో ప్రజలపై భారాలను మోపి, ముక్కు పిండి వసూలు చేసి.. తుదకు సామాన్య ప్రజలకు, రైతులకు కంటి తుడుపుగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. ఒకపక్క దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగింది. రూపాయి విలువ పతనం అయిపోయింది. ధరలు పెరిగి ప్రజలపై భారాలు పడుతున్నాయి. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉంది. కానీ నేటికి తగిన నిధులు కేటాయింపులు లేకపోవడం దారుణం. బడ్జెట్ పూర్తిగా ఎన్నికలను దష్టిలో పెట్టుకుని ప్రజలు దష్టిని మరల్చేలా ఉంది.

వి.ఉమామహేశ్వరరావు
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

డ్రెయినేజీ క్లీనింగ్ పౌడర్ తిని
ఐదుగురు విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి-రంపచోడవరం

డ్రైనేజీ క్లీనింగ్ పౌడర్ తినడంతో ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన రంపచోడవరంలో శుక్రవారం చోటు చేసుకుంది. రంపచోడవరం జీవీకే అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న ఒక విద్యార్థి తన ఇంటి వద్ద నుండి డ్రైనేజీ క్లీనింగ్‌కు ఉపయోగించే పౌడర్ ప్యాకెట్‌ను తన వెంట తెచ్చింది. ఈ పౌడరును సదరు విద్యార్థి అదే తరగతికి చెందిన మరో నలుగురు విద్యార్థులతో కలిపి తినడంతో వారు ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. దీనిని గమనించిన పాఠశాల సిబ్బంది హుటా హుటిన స్థానిక ఏరియా ఆసుపత్రికి వారిని తరలించారు. వెంటనే స్పందించిన హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.లక్ష్మి, వైద్యులు వారికి చికిత్స అందించారు. వీరిలో ఇద్దరు విద్యార్థుల (లలిత్, సత్యనారాయణ)కు తీవ్ర అస్వస్థతగా ఉండటంతో వారిని మెరుగైన వైద్య సేవల కోసం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో ముగ్గురు విద్యార్థుల (మోక్షిత్, తన్విక్, హరిప్రియ) పరిస్థితి నిలకడగా ఉండడంతో రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలోని వారికి వైద్య సేవలను అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

గిరిజనులతో సమావేశమైన ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్, డిఎఫ్ఒ

ఇజ్జలూరులో ఐటిడిఎ పిఒ పర్యటన

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలో జిఎం.వలస పంచాయతీ పరిధి మారుమూల గిరిజన ప్రాంతమైన ఇజ్జలూరు గ్రామంలో రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనూరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, డిఎఫ్ఓ నరేంద్రియన్ శుక్రవారం పర్యటించారు. గ్రామంలో 12 కుటుంబాలు 53 మంది జనాభా ఉండగా, ఆ వారు గ్రామస్తులతో అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఈ గ్రామం మొత్తం వైల్డ్ లైఫ్ (నేషనల్ పార్క్) ప్రాంతంలో ఉందని, అందువల్ల ఈ ప్రాంతానికి రహదారి, మౌలిక సదుపాయాలు కల్పించడం సాధ్యపడదని చెప్పారు. గ్రామస్తులు సహకరించి అనువైన ప్రాంతానికి రావాలని కోరారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికీ ఇల్లు నిర్మించి ఇస్తామని, భూమి ఇస్తామని, బతకడానికి ఉపాధి చూపిస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా ఈ ప్రాంత్రాన్ని సందర్శించి గ్రామస్తులందరూ బయట ప్రాంతాలని రావాలని కోరారు. గ్రామస్తులు వారికి సహకరించటంతో రెండవసారి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సబ్ కలెక్టర్, డీఎఫ్ఓ బృందం గ్రామాన్ని సందర్శించారు. తమ ప్రతిపాదనకు గ్రామస్తులు సుముఖంగా ఉన్నట్లు అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, వైద్య సిబ్బంది, గ్రామ వాలంటీర్ పల్లాల సూర్యనారాయణరెడ్డి, ఆశ వర్కర్ సాదల వెంకటలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మిరియాలను గిట్టుబాటు ధరకు విక్రయించాలి

-రైతులకు అన్ని విధాలుగా ప్రోత్సాహకం- జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: మన్యంలో మిరియాలకు మార్కెట్‌లో చాలా గిరాకీతో పాటు మంచి ధర ఉందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. పాడేరు ఏజెన్సీలో గిరిజన రైతులు ఉత్పత్తి చేస్తున్న మిరియాలకు జాతీయంగా మంచి నాణ్యత ఉన్నందున మిరియాల రైతులు లాభదాయకంగా మంచి గిట్టుబాటు ధరకు అమ్మకాలు చేయాలని జిల్లా కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో రైతులకు విజ్ఞప్తి చేశారు. చిక్మగలూరు, మడిగిరి, ఇడుక్కి, మంగళూరు, పుత్తూరు, గోవా, కొచ్చిన్ తదితర ప్రాంతాల్లో మిరియాలు కేజీ కనీసం రూ. 560 నుంచి గరిష్టంగా రూ. 600 ల వరకూ ధర పలుకుతోందని కలెక్టర్ వివరించారు. ఈ నేపథ్యంలో గిరి రైతులు కనీస ధర కంటే అధిక ధరకు అమ్మాలని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా తెల్ల మిరియాలకు మరింత మంచి ధర ఉందన్నారు. తెల్ల మిరియాలకు కేజీ రూ. 685 లు ధర పలుకుతోంది అని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో మిరియాల రైతులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తున్నామని, వారికి మిరియాలు వలిచి శుభ్ర పరిచే యంత్రాలు 75 శాతం రాయితీతో అందిస్తున్నామని, రైతులు మంచి నాణ్యత వచ్చే విధంగా వాటిని శుభ్రం చేయడం ద్వారా మిరియాలకు మరింత డిమాండ్, ధర లభించేలా కృషి చేయాలని కోరారు. తగు సలహాలు, సూచనలకు స్పైస్ బోర్డు అధికారులను సంప్రదించాలని సూచించారు.

నినాదాలు చేస్తున్న యుటిఎఫ్ నేతలు

రెండో రోజుకు యుటిఎఫ్ రిలే దీక్ష

ప్రజాశక్తి-పాడేరు: ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల ఆర్థిక లావాదేవీల విషయంలో ప్రభుత్వం పలు హామీలు ఇచ్చి అమలు చేయకుండా విస్మరించిందని యుటిఎఫ్ జిల్లా సహా అధ్యక్షులు నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక బకాయిల్ని చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు లో ఐటిడిఎ కార్యాలయం ముందు చేపట్టిన రిలే దీక్ష శుక్రవారం రెండో రోజు కొనసాగించారు. మండలాల యుటిఎఫ్ నాయకులు రిలే దీక్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలకు ఆర్థిక బకాయిలన్నీ ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యం. ధర్మారావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుడుగా ఆనాడు పాదయాత్రలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు గుప్పించి అధికారం దక్కించుకుని నేడు ఇచ్చిన హామీలు అమలు జరపాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు అడిగితే కనీసం మాటనైన మాట్లాడకపోవడం తగదని అన్నారు. జి.మాడుగుల మండల అధ్యక్షుడు ఎస్.గంగాధర్ మాట్లాడుతూ, కరువు భత్యాలకు ఇన్కమ్ టాక్స్ చెల్లించడం ఈ ముఖ్యమంత్రి హయాంలో చూసామన్నారు. తాము పొదుపు చేసుకున్న సొమ్ము నుండి లోన్లు చెల్లించ లేదని జిల్లా కార్యవర్గ సభ్యులు గల్లేల.సతీష్ అన్నారు. ఈ రోజు రిలే నిరాహారదీక్షలో యం.శ్రీను, ఈశ్వరరావు నాయుడు, సింహాచలం, ధనుపతి, కె.ఆనంద్, చిన్నయ్య, గోవింద్, జయకృష్ణ, అవినాష్, గణేష్ , చిరంజీవిలు పాల్గొన్నారు.

బోరును ఏర్పాటు చేయిస్తున్న సర్పంచ్

తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతగిరి రూరల్:మండలంలో పినకోట పంచాయతీ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు తాగునీటి సమస్య రాకుండ పరిష్కారానికి తన వంతు కషి చేస్తానని పినకోట పంచాయతీ సర్పంచ్ గణేష్ తెలిపారుశుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పినకోట పాఠ శాలలో విద్యార్థుల ఇబ్బందులు దృష్టిలో పెట్టు కొని ఆశిష్ కమ్యూనిటీహెల్త్ సంస్థ సహకారంతో బోరు వేయిస్తున్నానన్నారు ఈ కార్యక్రమం లో పాఠశాల హెచ్ఎం సొంబాబు, డిప్యూటీ వార్డెన్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

- విఆర్.పురంలో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు దర్శనం
- డ్రెయినేజీల్లో మురుగునీరు నిల్వ
- నెల రోజుల నుండి శుభ్రం చేయని వైనం
- ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో విధులకు హాజరు కాని కార్మికులు

గ్రామం మధ్యలో తాగునీటి బోరు వద్ద పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి-విఆర్.పురం

విఆర్.పురంలో పారిశుధ్యం పడకేసింది. అపారిశుధ్యం విలయతాండవం చేస్తోంది. నెల రోజులుగా గ్రామంలో చెత్తను తొలగించలేదు. డ్రెయినేజీలను శుభ్రపర్చలేదు. గ్రామంలో ఏ మూల చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. డ్రెయినేజీల్లో మురుగునీరు ప్రవహించడం లేదు. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే పరిస్థితి నెలకొంది.

విఆర్.పురం గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. దీనిపై కార్మికులు అనేక సార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో కుటుంబాలను పస్తులుండే పరిస్థితి నెలకొనడంతో కార్మికులు పారిశుధ్య పనులు మానేసి వేరే పనులకు వెళ్లిపోతున్నారు. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో స్థానికంగా పారిశుధ్య పనులు చేయించలేని పరిస్థితి నెలకొంది. దీంతో నెల రోజులుగా విఆర్.పురం గ్రామంలో పారిశుధ్య పనులు జరగడం లేదు. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇళ్లలో ప్రభుత్వం ఇచ్చిన చెత్త బుట్టల్లోనూ చెత్త నిండిపోయింది. డ్రెయినేజీలను శుభ్రం చేయకపోవడంతో చెత్త పేరుకుపోయి, మురుగునీరు ప్రవహించలేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు గ్రామ శివారులోని జరుగు సంత ప్రదేశంలోనూ చెత్తా చెదారం పెద్ద ఎత్తున కుప్పలు పడి ఉంది. గ్రామంలో దోమల వృద్ధి చెందిన స్వైర విహారం చేస్తుండడంతో గ్రామస్తులకు కంటి మీద కునుకు ఉండటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, పారిశుధ్యం మెరుగుపర్చాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువలో నిల్వ ఉన్న మురుగునీరు

వారపు సంత ప్రదేశంలో ఉన్న చెత్త కుప్పలు

తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టాలి

గ్రామంలో నెలరోజులుగా చెత్త తీయడం లేదు. డ్రైనేజీలు శుభ్రం చేయలేదు. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలు రోగాలను బారినపడే అవకాశం ఉంది. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి శుభ్రం చేయాలి. చెత్తను రోడ్లమీద వేయకుండా డంపింగ్ యార్డ్‌లో వేయాలి. గ్రామానికి కిలోమీటర్ల దూరంలో చెత్తను డంప్ చేయాలి



-సిహెచ్.సుబ్బారావు, విఆర్.పురం

డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్త

మురుగునీరు నిల్వతో వెదజల్లుతున్న దుర్గంధం

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని కరకగూడెం పంచాయితీ పరిధి గొమ్ము అయ్యవారిగూడెం గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. కొన్ని నెలలుగా డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు ప్రవహించకుండా నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇళ్లలో ఉండాలంటేే ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు దోమల వృద్ధి చెందిన స్వైర విహారం చేస్తున్నాయి. డ్రైనేజీలు మొత్తం చెత్త, వ్యర్థ పదార్థలతో నిండిఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయితీ అధికారులు పట్టించుకోవడం లేదని, కొంతమంది సొంతగా బాగు చేసుకున్న పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయితీ సిబ్బంది నిర్లక్ష్యం వీడి డ్రైనేజీలను శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డ్రెయినేజీలో చెత్త, మురుగునీరు

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-రంపచోడవరం

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని రంపచోడవరంలోని రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం పాసింజర్ ఆటోలు, గూడ్స్ వాహనాలు, బొలెరో వాహనాల యజమానులు, డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆర్.రాజేష్ కుమార్ మాట్లాడుతూ వాహనాలను నడిపేటప్పుడు డ్రైవర్లు పాటించవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. వాహన రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి, సక్రమంగా వాహన పన్ను చెల్లించి ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. వాహనాన్ని ఓవర్టేకింగ్ చేసే సమయంలో వేగంగా నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది వాహన యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడల్లో విజయకేతనం

పలు పోటీల్లో విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన రంపచోడవరం క్రీడాకారులు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఆడుదాం -ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో జరిగిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో రంపచోడవరం నియోజకవర్గం క్రీడాకారులు (ఆడ, మగ) విజయ దుందుభి మోగించారు. అరకు, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల నుండి 15 సంవత్సరాలు పైబడిన క్రీడాకారులు ఈ జిల్లాస్థాయిలో పోటీల్లో పాల్గొన్నారు. రంపచోడవరం నియోజకవర్గం క్రీడాకారులు కబడ్డీ (మెన్)- ప్రథమ స్థానం, ఖోఖో (మెన్) - ప్రథమ స్థానం, ఖోఖో (విమెన్)- ప్రథమ స్థానం, షటిల్ (విమెన్) ప్రథమ స్థానం, వాలీబాల్ (మెన్)- ద్వితీయ స్థానం, వాలీబాల్ (విమెన్) -ద్వితీయ స్థానం, షటిల్ (మెన్) - ద్వితీయ స్థానం, కబడ్డీ (విమెన్) తృతయ స్థానం, క్రికెట్ (మెన్) తృతీయ స్థానం సాధించారు. వీరికి మెరిట్ సర్టిఫికెట్‌లు, షీల్డ్స్ అందజేశారు. నగదు బహుమతులు క్రీడాకారుల అకౌంట్‌లో నేరుగా జమ చేయడం జరుగుతుంది. జిల్లా స్థాయిలో పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులు ఈ నెల 2 నుండి 10వ తేదీ వరకు విశాఖ జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ క్రీడాకారులతో సీనియర్లు, అనుభవజ్ఞులైన పీడీ, పీఈటీలను పంపించనున్నట్లు అధికారులు తెలిపారు. సచివాలయ, మండల, నియోజకవర్గం స్థాయిలో ఈ పోటీల నిర్వహణకు నియోజకవర్గానికి చెందిన 150 మంది పీడీలు, పీఈటీలు నిరంతరం శ్రమించారు.

వివిధ పోటీల్లో విజయం సాధించిన రంపచోడవరం క్రీడాకారులు

6న చింతపల్లిలో జాబ్‌మేళా

మాట్లాడుతున్న ఎఎస్‌పి శివకిషోర్

ప్రజాశక్తి-చింతపల్లి: నిరుద్యోగులైన యువకులకు ఈనెల 6న చింతపల్లి వై.టి.సి.లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. 18సంవత్సరాల నుండి 30సంవత్సరాల వయసు గల ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.అర్హులైన యువతకు బెంగళూరులోని కోచింగ్ సెంటర్‌లో ఉచిత భోజనం, వసతులు కల్పించి సుమారు 20 వేల రూపాయల ఉద్యోగ భద్రత కల్పిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్,సీఐ రమేష్, ఎస్సై అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

వైసిపి గెలుపు తథ్యం

అరకు సమన్వయకర్త మత్స్యలింగం

మాట్లాడుతున్న మత్స్యలింగం

ప్రజాశక్తి- అరకులోయ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అరకు నియోజకవర్గంలో వైఎస్ఆర్ సిపి గెలుపు తథ్యమని ఆ పార్టీ అరకు నియోజకవర్గ సమన్వయకర్త రేగం మత్స్య లింగం స్పష్టం చేశారు.స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘ భవనంలో శుక్రవారం పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏ గ్రామానికి వెళ్లిన వైఎస్ఆర్ సీపీకి విశేష స్పందన లభిస్తుందని ఆయన అన్నారు. ప్రతి ఒక్క ఆసాహులను సమిష్టిగా పనిచేసి గెలుపుకు కృషి చేయాలని కోరారు. వైసిపి చేసిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పంచాయతీలకు చెందిన నాయకులు, ఎంపిటిసిలు , సర్పంచులు పాల్గొన్నారు.

ఎంఇఒకు ఘన సన్మానం

సన్మానిస్తున్న ఉపాధాయులు

ప్రజాశక్తి- పెదబయలు: మండల విద్యా శాఖాధికారి కొమ్ము కృష్ణమూర్తి రిపబ్లిక్ వేడుకల్లో ఉత్తమ అవార్డు అందుకోవడంతో మండల ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఎంపీ ఎలిమెంటరీ పాఠశాల, యుటిఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు ఎస్‌బి ఎల్ స్వామి, యుటిఎఫ్ నాయకులు జె.సత్యనారాయణ, గండేరు మాధవరావు పాల్గొన్నారు

'స్పందన' సమస్యలపై జవాబుదారీగా ఉండాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ : 105 వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ లో శుక్రవారం నిర్వహించిన స్పందనకు వినతులు వెల్లువెత్తాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డిలు వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 105 వినతులు స్వీకరించారు. తాగునీటి సమస్యలు, రహదారులు, వంతెన నిర్మాణాలు, విద్యుత్ సమస్యలు, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలపై వినతులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన సమస్యల పరిష్కారానికి అధికారులు జవాబుదారీగా ఉండాలని చెప్పారు. అధికారులు స్పందనకు హాజరై ఫిర్యాదులు పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు.

పలు వినతులు :

పాడేరు మండలం దేవాపురం పంచాయతీ వి. గడబఊరు నుండి కుమ్మరిపాలెం వరకు, డప్పాడ గ్రామం నుండి జర్రిగరువు గ్రామం వరకు మిషన్ కనెక్ట్ పాడేరులో మంజూరు చేసిన రోడ్డు పనులు పూర్తి చేయాలని సర్పంచ్ కిల్లు పరమేశ్వరి వినతి పత్రం సమర్పించారు. హుకుంపేట మండలం జర్రకొండ పంచాయతీ సిరియా గ్రామం నుండి గనిక గ్రామం వరకు గ్రావెల్ రోడ్డు నిర్మించాలని సర్పంచ్ కొర్రా చిట్టిబాబు వినతి పత్రం అందజేసారు.

అరకు వ్యాలీ మండలం బొండం పంచాయతీ జయంతి వలస గ్రామానికి చెందిన కిల్లో బుజ్జిబాబు వ్యవసాయ పనులు నిర్వహించడానికి పవర్ వీడర్ కోసం దరఖాస్తు చేసారు. పాడేరు మండలం సలుగు ఎంపిటిసి చిప్పాడ మీనా సలుగు సచివాలయం భవనానికి విద్యుత్ సదుపాయం కల్పించాలని వినతి పత్రం సమర్పించారు.

ముంచంగిపుట్టు మండలం బంగారుమెట్ట పంచాయతీ పరిధిలోని మాలగుమ్మి, శరభపుట్టు, కుజభంగి, సరియాపల్లి గ్రామాలకు తాగునీటి సదుపాయాలు కల్పించాలని సర్పంచ్ వి.రత్న వినతి పత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్‌డిసి, వి.వి.ఎస్. శర్మ, గిరిజన సంక్షేమ శాఖ డిడి. ఐ.కొండలరావు, ఇఇ కొండయ్య పడాల్, డిఇ ఆర్‌ఎం. రాజు, పంచాయతీ రాజ్ ఇఇ బిబి ఆర్. డి. ఏ. పిడి. వి.మురళి, ఐటిడిఎ పరిపాలనాధికారి ఎం. హేమలత తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న జిల్లాకలెక్టర్ సుమిత్‌కుమార్, జెసి భావన

వంతెన మంజూరుకు వినతి

అనంతగిరి: నిలిచిన వంతెన పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం పాడేరు ఐటిడిఎలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లు మాజీ ఎంపిటిసి సంసన్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, అనంతగిరి మండలం పిల్లలగెడ్డ, కొంపల్లి పంచాయతీ, విజయనగరం జిల్లా అడ్డతీగల పంచాయతీ పరిధి పలు గ్రామాలకు రోడ్డు సౌకర్యంకు చికలగెడ్డ పంచాయతీ జలగుపాడు ,పరిధిలో తాటిపూడి గోస్తనిగెడ్డపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. నిధులు చాలక పోవడంతో చివరి దశలో పనులు నిలిచి పోయాయన్నారు.

పివిటిజి పథకాలకు వినతి

అనంతగిరి: పివిటిజి గిరిజనులకు కేంద్ర ప్రభుత్వం పథకాలను అందించాలని పాడేరు గ్రీవెన్స్‌లో లిఖితపూర్వకంగా విన్నవించామని బీంపోలు పంచాయతీ ఎంపీటీసీ అశోక్, ఉప సర్పంచ్ అప్పలకొండ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధి నందకోట, కొత్తవలస, బన్న గ్రామాలకు గిరిజన లబ్ధిదారులకు ఇల్లు మంజూరు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అమలు చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

ప్రజాశక్తి-పాడేరు: పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. రంపచోడవరం, అరకు, పాడేరు ఎన్నికల అధికారులతో శుక్రవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తహశీల్దారులు, బూత్ స్థాయి అధికారులతో ఎన్నికల అధికారులు సమావేశాలు నిర్వహించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి సమస్యలుంటే పరిష్కరించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు ర్యాంపులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలని చెప్పారు. జిల్లాలోని ముగ్గురు ఎన్నికల అధికారులకు ఒక్కొక్కరికి రూ.2.50లక్షల నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు. ఆ నిధులతో పనులు చేయించాలని స్పష్టం చేసారు.

ఈ నెల 10 వ తేదీ నాటికి ర్యాంపుల నిర్మాణాలు పూర్తి చేయాలని పేర్కొన్నారు. రానున్న 15 రోజుల్లో కొత్త మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసారు.ఎన్నికల కమిషన్ ఆదేశాలను జిల్లాలో పక్కాగా అమలు చేయాలని చెప్పారు. గిరిజనులతో సౌమ్యంగా మంచిగా వ్యవహరించాలని సూచించారు. కొత్తగా వచ్చిన అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించాలన్నారు. ఓట్లను తొలగిస్తే విధిగా జిల్లా ఎన్నికల అధికారి అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట్ పాడేరు, రంపచోడవరం ఐటిడిఏ పిఓలు వి.అభిషేక్, సూరజ్ గనోరే, డి.ఆర్.వి.వి.రమణ, ఎస్‌డిసిలు వివిఎస్ శర్మ, అంబేద్కర్ తహశీల్దారులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే, కేవలం 6,100 పోస్టుల భర్తీకి మంత్రిమండలి ఆమోదించడం సరికాదని, ప్రభుత్వం వెంటనే స్పందించి పోస్టుల సంఖ్యను పెంచి ఖాళీలన్నీ భర్తీచేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా నిరుద్యోగులను ఊరిస్తూ, ఇపుడు ఎన్నికలకు కేవలం కొద్దిరోజుల ముందు 6,100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామనడం నిరుద్యోగులను మోసగించడమేనన్నారు. మాటిచ్చి, మడమ తిప్పడం వైసిపి ప్రభుత్వానికే చెల్లుతుందని ఆరోపించారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు

క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జివిఎంసి మినీ క్రికెట్ స్టేడియంలో మూడు రోజులపాటు నిర్వహించే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బెలూన్లను ఎగరేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విదేశాల్లో ఎంతగానో ప్రాచుర్యం పొందిన రగ్బీ క్రీడా పోటీలను ఇక్కడ నిర్వహించడం అభినందనీయమన్నారు. గెలుపోటములను ఒకేలా స్వీకరించి, క్రీడాస్ఫూర్తిని, పోటీతత్వాన్ని అలవరచు కోవాలని పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన 14 ఏళ్ల లోపు బాలబాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాల్గో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్ లలిత్‌కుమార్, కార్యదర్శి సిహెచ్ కిషోర్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి బి.రామాంజనేయులు, రగ్బీ ఛాంపియన్ షిప్ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్, సన్ స్కూల్ డైరెక్టర్ కె శ్రీనివాసరావు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, వైసిపి నాయకులు మైలపల్లి షణ్ముఖరావు, కె ఎల్లాజీ, ఎస్ కరుణాకరరెడ్డి పాల్గొన్నారు

6న ఎయులో 'నిక్ వుజిసిక్' ప్రసంగం

- స్ఫూర్తిదాయక స్పీచ్‌లతో ప్రపంచవ్యాప్తంగా యువతకు దగ్గరైన నిక్

ప్రజాశక్తి- విశాఖపట్నం : తమ స్ఫూర్తిదాయక ప్రసంగాలతో ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యానికి గురిచేసిన ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ ఈనెల 6న మంగళవారం ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సందర్శిస్తున్నారు. సాయంత్రం 4 గంటలకు ఎయు ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో యువతను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. చేతులు,కాళ్లు లేకుండా జన్మించిన నిక్, తన తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహంతో ఒక్కోమెట్టు ఎక్కారు. తన జన్మకు ఒక లక్ష్యం ఉండాలన్న సంకల్పంతో ఎన్నో అవరోధాలు, అవమానాలు ఎదురైనా చలించ కుండా, కాళ్లుచేతుల లేకపోయినా మెక్కవోని దీక్షతో ఈత కొట్టడం, సర్ఫింగ్ చేయడం, గోల్ఫ్ ఆడటం, నోటిలో పెన్ను పెట్టుకుని రాయడం, కాలి వేళ్లతో టైపింగ్ చేయడం వంటి విభిన్న సామర్థ్యాలను అందిపుచ్చుకున్నాడు. ఈ క్రమంలో ఒక మంచి వక్తగా కూడా పేరు తెచ్చుకున్నాడు. నిరాశ, నిస్పృహతో కొట్టుమిట్టాడుతున్న యువతకు తన జీవితం ఒక స్ఫూర్తి, ప్రేరణ ఇచ్చేలా ముందుకు సాగాడు.

నిక్ వుజిసిక్

అన్ని అవయవాలు సక్రమంగా, ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నా క్షణికావేశంతో, చిన్నపాటి కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న యువతకు నిక్ జీవితం ఒక ప్రేరణగా నిలుస్తుంది. నేడు ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందిని నిక్ తన ప్రసంగాలతో స్ఫూర్తిని నింపుతూ యువతలో మనోధైర్యాన్ని నింపుతున్నారు. యువతకు స్ఫూర్తిని అందిస్తూ మోటివేషనల్ స్పీకర్‌గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నిక్ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించడానికి యువతకు అవకాశం కల్పిస్తున్నట్లు ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలిపారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని బడదనాంపల్లి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ఎంపిడిఓ ఎంవి రంగారావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 162 మంది రోగులకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నాగార్జున, అనిల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.కోటేశ్వరరావు, వైద్య సిబ్బంది సీహెచ్ ప్రసాద్, శివకుమార్, ఏసుబాబు, కుశరాజు, అమరేష్, రమాబాయి, రాజి, బాలమ్మ, సంపత్, రామారావు, రవి, నానిబాబు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

4న విశాఖలో విప్రోత్సవం -2024

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రానున్న ఎన్నికల్లో విశాఖ లోక్‌సభ స్థానంగానీ, లోక్‌సభ పరిధిలోని ఒక అసెంబ్లీ స్థానంగానీ బ్రాహ్మణ సామాజిక తరగతికి ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలనూ కోరుతున్నట్లు బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ బ్రాహ్మణుల్ని ఒకతాటిపైకి తెచ్చేందుకు, వారిని ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా చైతన్యవంతుల్ని చేసేందుకు ఈ నెల 4న విశాఖలో 'విప్రోత్సవం 2024' పేరిట ఓ భారీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. గురజాడ కళాక్షేత్రంలో ఆదివారం మధ్యాహ్నం ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని కార్యక్రమ కన్వీనర్ పివి.నారాయణరావు చెప్పారు.

బ్యాంకాక్, కౌలాలంపూర్లకు నేరుగా విమానాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ విమానాశ్రయం నుంచి బ్యాంకాక్, కౌలాలంపూర్‌లకు ఏప్రిల్ నుంచి నేరుగా విమాన సర్వీసులు నడవనున్నాయి. ఎయిర్ ఏసియా వెబ్‌సైట్‌లో ఈ మేరకు టికెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. విశాఖలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎపి విమాన ప్రయాణికుల సంఘం (ఎపిఎటిఎ) అధ్యక్షులు కుమార్‌రాజా, ఉపాధ్యక్షులు ఒ.నరేష్ కుమార్, డిఎస్.వర్మ ఆ వివరాలు వెల్లడించారు. ఈ మేరకు బ్యాంకాక్ విమానం ఏప్రిల్ 9న రాత్రి 11:50 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి 2 గంటలా 45 నిమిషాల్లో అక్కడికి చేరుకుంటుంది. ప్రారంభ టికెట్ ధర రూ.7,999. కౌలాలంపూర్ విమానం ఏప్రిల్ 26న రాత్రి 7 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 4 గంటల వ్యవధిలో విశాఖ చేరుకుంటుంది. ప్రారంభ టికెట్ ధర రూ.4,999. ఈ రెండు విమానాల్లో ప్రయాణించేందుకు మే వరకు వీసా అవసరం లేదు. ఈ నెల 9 నుంచి విశాఖ - హైదరాబాద్ మధ్య ఎయిర్ ఇండియా మరో సర్వీసు నడపనుంది. మే లేదా జూన్‌లో నేరుగా దుబాయ్‌కు విమాన సర్వీసు ప్రారంభం కానుంది. విశాఖ విమానాశ్రయం ఇన్‌ఛార్జి డైరెక్టర్ రాజా రామన్ మాట్లాడుతూ మార్చి 31 నాటికి విమానాశ్రయం రన్ వే నవీకరణ పనులు పూర్తవుతాయని నౌకాదళ అధికారులు తెలిపారని, కావున ఏప్రిల్ నుంచి డీజీ యాత్ర సదుపాయం ప్రయాణికులకు అందుబాటులోకి రానుందని చెప్పారు. విమానాశ్రయంలో అదనంగా మరో 10 కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

10న విశాఖలో ఎఐ క్లౌడ్ సమ్మిట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10న విశాఖపట్నంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో ఎఐ క్లౌడ్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ శ్రీధర్ కొసరాజు తెలిపారు. శుక్రవారం ఉదయం బీచ్ రోడ్డులోని అంబికా సి గ్రీన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశమంతటా ఉన్న ఎంఎన్‌సి కంపెనీలను, హైటెక్ కంపెనీలకు చెందిన నిపుణులను ఒకచోట చేర్చి తద్వారా రాబోయే రోజుల్లో అందుబాటులోకి రానున్న సాంకేతికతపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.

క్రికెట్ జోష్

- ఎసిఎ - విడిసిఎ స్టేడియం వద్ద అభిమానుల సందడి
- మైదానంలో అంతర్జాతీయ స్థాయి వసతులు : బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్

క్రీడాభిమానులతో కిక్కిరిసిన ఎసిఎ - విడిసిఎ స్టేడియం

ప్రజాశక్తి - పిఎం.పాలెం

క్రికెట్ అభిమానుల సందడితో వైజాగ్‌లో పండగ వాతావరణం నెలకొంది. శుక్రవారం నుంచి పిఎం.పాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య రెండో టెస్టు మ్యాచ్ ప్రారంభమవగా తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచీ క్రీడాభిమానులు తరలివచ్చారు. ఇంగ్లండ్ నుంచీ పెద్ద ఎత్తున ప్రేక్షకులు తరలిరావడం విశేషం. గతంలో ఏ మ్యాచ్‌కూ రానంతగా ఈ మ్యాచ్‌ను తిలకించేందుకు జనం రావడంతో స్టేడియం పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. క్రీడాభిమానులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.శరత్ చంద్రారెడ్డి, ఎస్‌ఆర్.గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అవసరమైన ఏర్పాట్లు చేశారు. మ్యాచ్ సందర్భంగా రోజుకు రెండు వేల మంది చొప్పున విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించాలని ముందుగా నిర్ణయించినా అందుకు రెట్టింపుగా వచ్చినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారినీ స్టేడియంలోకి అనుమతించారు.

అలరించిన యశస్వి జైశ్వాల్

తొలి రోజు ఆటలో భారత్ ఆటగాడు యశస్వి జైశ్వాల్ అదరగొట్టాడు. 256 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. ఆయన ఫోర్, సిక్స్ కొట్టినప్పుడల్లా అభిమానులు ఎగిరి గంతేశారు. పెద్దపెట్టున అరుస్తూ ఉత్సాహం నింపారు. తొలిరోజు ఆట ముగిసేసరికి భారత్ ఆరు వికెట్లు కోల్పోయి 336 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో సోయబ్ బషీర్, అహ్మద్ చెరో రెండు వికెట్లు తీశారు.

మైదానం ఎంతో బాగుంది

విశాఖనగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో అంతర్జాతీయ స్థాయికి ఏమాత్రమూ తీసిపోని విధంగా వసతులు ఉన్నాయి. ఎసిఎ సిబ్బంది ప్రత్యేక గదిని ఏర్పాటు చేసినా ప్రేక్షకుల మధ్యలోనే కూర్చొని మ్యాచ్ చూడటం ఎంతో ఆనందంగా ఉంది. ఇండియాకు వచ్చిన తర్వాత ఉదయం నుంచి సాయంత్రం వరకు కూర్చొని మ్యాచ్ చూడటం ఇదే మొదటిసారి. క్రికెట్ అభిమానులు మ్యాచ్‌ను చూసేందుకు పెద్ద ఎత్తున వచ్చినా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయడం అభినందనీయం.

గరెత్ విన్ ఓవెన్, బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్, ఎపి, తెలంగాణ

పరుగు తీస్తున్న రోహిత్‌శర్మ, జైశ్వాల్

ఆహ్లాదకర వాతావరణం

స్టేడియం పరిసర ప్రాంతం ఆహ్లాదకరంగా ఉంది. స్టేడియంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో వివిధ రకాల వంటకాలను అందుబాటులో ఉంచారు.

దేవ్ క్లార్క్, ఇంగ్లండ్

రుచికరమైన ఆహారం

స్టేడియంలో ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు చేయడం అభినందనీయం. ఎలాంటి అసౌకర్యానికీ గురికాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తాగునీరు ఎప్పటికప్పుడు అందించారు.

రమేష్, విశాఖపట్నం

ఉచిత ప్రవేశం అభినందనీయం

విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించడం అభినందనీయం. విద్యార్థులందరినీ స్టేడియంలోకి అనుమతించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది.

నారాయణ, విద్యార్థి, విశాఖపట్నం

ట్రాఫిక్ ఇబ్బందులు తప్పాయి

స్టేడియం వద్ద పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తప్పాయి. గతంలో వాహనం పార్కింగ్ చేయాలంటే చాలా ఇబ్బంది పడేవాళ్లం. ప్రస్తుతం అలాంటి సమస్య ఏర్పడలేదు.

కుమార్, విద్యార్థి, భీమిలి

ఇగ్నో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో జనవరి 2024 విద్యా సంవత్సరానికిగానూ వివిధ దూరవిద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సులలో ప్రవేశాలకు ప్రకటన జారీ అయినట్టు వర్సిటీ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు శుక్రవారం తెలిపారు. విశ్వవిద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పిజి డిప్లొమా, డిగ్రీ, అన్ని పీజీ కోర్సులలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. ఈ అడ్మిషన్లు https://ignouadmission.samarth.edu.in లింక్ ద్వారా పొందవచ్చునని తెలిపారు. అన్ని కోర్సులలో ప్రవేశాలకు గడువు తేదీ ఫిబ్రవరి 15 అని పేర్కొన్నారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నింటిలో ఈ విద్యా సంవత్సరానికిగానూ ప్రవేశాలు పొందే వీలుందన్నారు. ప్రవేశాలన్నీ ఆన్‌లైన్ విధానం ద్వారా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఫీజులు కూడా ఆన్‌లైన్ ద్వారానే కట్టాల్సి ఉంటుందని చెప్పారు.



గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న ఎపిఒ శ్రీనివాసరావు, ఎఒ రమణ

గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం : ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద రంపచోడవరం మండలానికి రెండోసారి మంజూరైన 50 మంది లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కలెక్షన్లను ఐటిడిఏ ఏపీఓ శ్రీనివాసరావు, ఏవో రమణ శుక్రవారం పంపిణీ చేశారు. అర్హులైన అందరికీ ఉచితంగా గ్యాస్ కలెక్షన్లను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సిబ్బంది చిన్నబ్బాయి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

శ్రీధర్‌ను సత్కరిస్తున్న అధికారులు, ఉద్యోగులు

తహశీల్దార్ శ్రీధర్‌కు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-విఆర్.పురం : విఆర్.పురం మండల తహశీల్దారుగా పని చేస్తూ బదిలీ అయిన ఎన్.శ్రీధర్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రం రేఖపల్లి ఎమ్మార్వో కార్యాలయంలో జరిగిన వీడ్కోలు సభలో తహశీల్దారు కార్యాలయ సిబ్బంది, వివిధ విభాగాల ఉద్యోగులు, రేషన్ డీలర్‌లు, జిసిసి ఉద్యోగులు విఆర్‌ఒలు, విఆర్ఎలు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, వీఆర్వోలు రమాదేవి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీ సీటుపై నా నుంచి ఎలాంటి ప్రతిపాదనా లేదు'

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : పార్టీల్లో పదవులు, అనకాపల్లి ఎంపీ సీటు సంపాదించి పోటీ చేయాలనే ప్రతిపాదన ఏదీ జనసేన అధిష్టానాన్ని అడగలేదని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ తెలిపారు. గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం, ఈ ప్రాంత సమస్యలపై పోరాడిన సందర్భాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను నిలబెట్టుకునే కృషిలో తన భాగస్వామ్యాన్ని ప్రస్తావిస్తూ శుక్రవారం విశాఖలోని దసపల్లాలో ప్రింట్ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా ఆయన మాట్లాడారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను నిలబెట్టుకోవడం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ, విశాఖకు రైల్వేజోన్ సాధన, పోలవరం ప్రాజెక్టు తదితర అంశాల అజెండాయే తనకు ముఖ్యమని ఆయన అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ కాకుండా కేంద్రంతో సరైన రీతిలో సంప్రదింపులు లేదా లాబీయింగ్ జరిపైనా నిలబెట్టుకోవాల్సి ఉందన్నారు. గతంలో స్టీల్‌ప్లాంట్‌కు నష్టాలొచ్చిన సందర్భంలో పివి.నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు తాను కాంగ్రెస్ తరపున రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహించి నాటి దేశ ఆర్థిక మంత్రి మన్మోహన్‌సింగ్ ద్వారా పరిష్కారానికి జరిపిన కృషిని వివరించారు.